సాక్షి తిరుపతి

శుక్రవారం । 12 । మే । 2023



భక్తుల జోరు..సారెల హోరు!

తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగ జాతర వైభవోపే తంగా సాగుతోంది. మూడో రోజు గురువారం గంగమ్మకు సారెలు హోరెత్తాయి. -IIలో



విజయవాడకు ప్రచార రథం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ప్రచార రథం ప్రత్యేక పూజల అనంతరం విజయవాడకు బయలుదేరి వెళ్లింది.

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	39	27
చిత్తూరు	39	27
తిరుమల	36	23
గూడూరు	43	29
నగరి	41	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,510 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,399 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.59 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

ఉచిత వైద్య పరీక్షలకు విశేష స్పందన



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాకాల: మండలంలోని ఉప్పరపల్లి, పెద్దగోర్పాడు, చిన్నగోర్పాడు గ్రామాల్లో చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలకు విశేష స్పందన లభిస్తోంది. గురువారం ఉచిత వైద్య పరీక్షలు చేసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ శిబిరాలకు వచ్చే ప్రజలకు కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా సుమారు 43 రకాల వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామాల్లో వైద్యపరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నేటి నుంచి అంతర్రాష్ట్ర ఓపెన్ షటిల్ టోర్నీ



వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్: స్వర్ణముఖి నది సమీపంలోని ఇండోర్ స్టేడియంలో శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు అంతర్రాష్ట్రీయ పురుషుల ఓపెన్ షటిల్ పోటీలను నిర్వహించనున్నట్టు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ ఆకాడమీ వారు గురువారం తెలిపారు. 3వ రోలింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు షటిల్ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. వరుస విజేతలకు రూ.35వేలు, రూ.25వేలు, రూ.15 వేల నగదు బహుమతులను అందిస్తామని చెప్పారు.

నేడు డయల్ యువర్ ఈఓ

తిరుమల : శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరుగనుంది. ఈ సందర్భంగా భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

అంగన్‌వాడీ పోస్టులకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి అర్బన్: జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లతో పాటు, మినీ అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు శుక్రవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి తెలిపారు. జిల్లాలో 11 అంగన్‌వాడీ కార్యకర్తలు, 9 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 61 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించినవారు, స్థానికులు, వయస్సు 21-35, వివాహితులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

వేసవి ప్యాకేజీ టూర్

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవుల దృష్ట్యా ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ ఎం.గిరిధర్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఆది, సోమవారం గుడిమల్లం -తిరుచానూరు కొత్త ప్యాకేజీ టూర్ నాన్ ఏసీ రవాణా, గైడ్ సౌకర్యంతో ఉంటుందని పేర్కొన్నారు. నిర్ణయించిన రోజుల్లో ఉదయం 7 నుంచి 11 గంటలకు ఈ రవాణా శ్రీనివాసం నుంచి మొదలవుతుందని తెలిపారు. ఈ యాత్రలో ప్రయాణికులకు ఒక్కోటికెట్ రూ.200 నిర్ణయించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాలల బలగం!

బాల భవిత కేంద్రం చిన్నారుల భవితకు అండగా నిలుస్తోంది. పుట్టుకతోనే లోపాలు వస్తే అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి భరోసా కల్పిస్తోంది. ఆరోగ్య విషయంలో సమస్యలు గుర్తించి ఉచిత వైద్యం చేస్తూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. థెరపీలు చేయిస్తూ శారీర సమస్యల నుంచి విముక్తి కలిగిస్తోంది. కాస్త మెరుగుపడ్డాక ఇతరత్రా ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీద్వారా ఆపరేషన్లు చేయిస్తూ.. చిన్నారుల ఆరోగ్యానికి బలగంగా నిలుస్తోంది. డీఈఐసీల్లో అందే సేవలు.. సత్ఫలితాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- ▸▸ బైరెడ్డిపల్లికి చెందిన వినయ్ వంకర కాళ్లుతో పుట్టాడు. వెంటనే చిన్నారిని డాక్టర్ల సూచనల మేరకు తల్లిదండ్రులు చిత్తూరు డీఈఐసీ (జిల్లా బాల భవిత కేంద్రం)కి తీసుకొచ్చారు. అప్పటి నుంచి రెండేళ్ల పాటు చికిత్స అందించారు. తర్వాత పిండికట్టు వేయించారు. చిన్న థెరపీ చేయించారు. ఇప్పుడు మంచి ఫలితాలొచ్చాయని వైద్యులు, చిన్నారి తల్లిదండ్రులు చెబుతున్నారు.
- ▸▸ చిత్తూరుకు చెందిన రితీకా పుట్టిన వెంటనే పక్షవాతానికి గురైంది. ఏడాది నుంచి చిత్తూరు డీఈఐసీలో థెరపీ చేయించుకున్నారు. మూడేళ్లుగా డాక్టర్ల సూచనలు, సలహాలు తీసుకున్నారు. మెరుగైన చికిత్స అందడంతో పక్షవాతం నుంచి ఆ బాలిక కోలుకుంది. ఇప్పుడు పాఠశాలకు వెళ్లి చదువుకుంటోంది.
- ▸▸ పీలేరుకు చెందిన ఓ బాలుడు వినికిడి సమస్యతో పుట్టాడు. చిత్తూరు కేంద్రం ద్వారా ఆ బాలుడికి కొన్నాళ్లుగా చికిత్స అందిస్తూ వచ్చారు. కాస్త మెరుగైన చికిత్స అందడంతో ఆరోగ్యశ్రీ ద్వారా గుంటూరులోని ఓ ఆస్పత్రిలో కాక్లియర్‌ప్లాంటేషన్ చేయించారు. ఇందుకు ప్రభుత్వం రూ.6 లక్షలు ఖర్చు చేసింది.



- ▸▸ గుంటూరు జిల్లా, వెంకటచింతల మండలానికి చెందిన కమలరావ్ (15) గుండె సంబంధిత జబ్బుతో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు పలు ప్రైవేటు ఆస్పత్రులకు తిరిగారు. తీరా తిరుపతిలోని డీఈఐసీని 2020ని ఆశ్రయించారు. 15 రోజుల పాటు బాలుడిని అక్కడి డాక్టర్లు పర్యవేక్షణలో ఉంచారు. తర్వాత ఆరోగ్యశ్రీ ద్వారా పద్మావతి హృదయాలయంలో ఆపరేషన్ చేయించారు. ఇప్పుడు బాలుడు స్కూల్‌కు వెళుతున్నాడు.

- చిన్నారులకు అండగా బాల భవిత కేంద్రాలు
- పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత సేవలు
- కేంద్రాల్లో సత్ఫలితాలిస్తున్న ఫిజియోథెరపీ
- ఆరోగ్యశ్రీలో విలువైన ఆపరేషన్లు



చిత్తూరులో ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్

సాక్షి, తిరుపతి డెస్క్: చిత్తూరు జిల్లా కేంద్రం, తిరుపతి రుయా ఆస్పత్రి ఆవరణలోని డీఈఐసీ(జిల్లా బాల భవిత కేంద్రం)ల్లో 0-18 ఏళ్ల లోపు పిల్లల ఆరోగ్య సమస్యలకు ముందస్తు చికిత్స అందిస్తున్నారు. పుట్టుకతో వచ్చే పోషకాహార లోపం, బాల్యంలో వచ్చే వ్యాధులు, వైకల్యంతో కూడిన లోపాలకు చికిత్స చేస్తున్నారు. మానసికంగా సరిగా లేని పిల్లలకు, దృష్టి, వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఇక్కడ చికిత్స చేస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి నిత్యం ఈ కేంద్రాలకు 80 నుంచి 120 మంది పిల్లలు వస్తుంటారు. బుద్ధిమాంద్యానికి మేలైన వైద్య సేవలందించడంతో పాటు శారీరక వికలత్వ నివారణకు ఈ కేంద్రాలు తోడ్పాటందిస్తున్నాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైకల్యం, లోపాలు ఇలా

అటిజన్, దృష్టి, వినికిడి సమస్యలు, నాడీ చలన సమస్యలు, నడక ఆలస్యం, జ్ఞానపరంగా అభివృద్ధి ఆలస్యం, మాటలు ఆలస్యం, అభ్యసనా సమస్యలు, చురుకుదనం లోపం తదితర వాటికి చికిత్స అందిస్తారు. వీటిన్నంటికీ థియరీ చికిత్సలు చేస్తారు. ఈ కేంద్రాల్లో నెలకు వందల సంఖ్యలో ఓపీలు వస్తుంటాయి. ప్రతి సోమ, శుక్రవారాల్లో స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తారు. అలాగే కళ్లు, వినికిడి సమస్యలపై దృష్టిపెట్టి వైద్యసేవలందిస్తారు. చర్మ వాధ్యులు, చెవుల్లో చీము, వాపు, రుమాటిక్ గుండె వ్యాధులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, మూర్ఛ, దంతాలు, చిగుళ్ల వ్యాధులకు చికిత్స అందిస్తారు.

సేవలు ఇలా..

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు పిల్లల వరకు లోపాలను డీఈఐసీలో గుర్తిస్తారు. పుట్టుకతో వచ్చే నాడీ వ్యవస్థ లోపం, డౌన్ సిండ్రోమ్, వంకర పాదాలు, గ్రహణ మొర్రి, పెదవి అంగిట్లో చీలిక, వినికిడి లోపం, స్పీచ్ థెరపీ, నెలలు నిండని పిల్లలు, గ్లకోమా సెంద్రియా, మైక్రోసియా, అతుక్కున్న వేళ్లు, కేటరాక్ట్‌లోపం, గుండె జబ్బులు, నడుంభాగం అభివృద్ధి లోపాలను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. రక్తహీనత, అయోడిన్ లోపం, రిక్కెట్స్, రేచీకటిలాంటి తీవ్రపోషకాహార లోపాలకు సేవలందిస్తారు. ఈ క్రమంలో అత్యాధునిక పరికరాలను కూడా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ఇక్కడ పరీక్షల ఆధారంగా ఆరోగ్యశ్రీ ద్వారా గుంటూరు, తిరుపతిలోని ఆస్పత్రుల్లో అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తున్నారు. గుంటూరులో కాక్లియర్‌ప్లాంటేషన్ చేయిస్తున్నారు. ఇందుకు ఆరోగ్యశ్రీద్వారా రూ.6 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. గత రెండేళ్ల కాలంలో ఈ కేంద్రం ద్వారా 27 మందికి ఆపరేషన్ చేయించినట్టు వైద్యులు తెలిపారు. అలాగే తిరుపతిలో 260 మంది పిల్లలకు గుండె సంబంధిత ఆపరేషన్లు చేయించగా.. ఒక్కో ఆపరేషన్‌కు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఖర్చుచేశారు. వంకర పాదాలు ఉన్న పిల్లలకు ఇప్పటి వరకు 305 మందికి ఆపరేషన్ చేయించగా.. ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేసింది. మూడేళ్ల కాలంలో 12 వేల మంది ఈ కేంద్రాలను ఆశ్రయించగా.. ఐదువేల మంది పిల్లలు రికవరీ అయినట్టు వైద్యులు చెబుతున్నారు.



తిరుపతి కేంద్రంలో పిల్లలకు ఫిజియోథెరపీ



పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న డాక్టర్లు



స్పెషల్ ఎడ్యుకేటర్ స్పీచ్ థెరపీ

కేంద్రంలో ఎవరెరుంటారంటే..

ఈ కేంద్రంలో చిన్న పిల్లల వైద్యులు, మెడికల్ ఆఫీసర్, డెంటల్ డాక్టర్, సైక్రాటిస్ట్, ఫిజియోథెరపిస్ట్, ఆడియాలజిస్ట్, కంటి వైద్యులు, ఎర్లీ ఇంటర్‌వెంటనిస్ట్ (స్పీచ్, స్పెషల్ ఎడ్యుకేషన్), సోషల్ వర్కర్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, మేనేజర్లు ఉంటారు.

డీఈఐసీ వెన్నెముఖలాంటింది



రోజుల బిడ్డ నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు కేంద్రంలో వైద్యం చేస్తాం. అన్ని రకాల డాక్టర్లు ఉన్నారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఆడియాలజిస్ట్ సేవలు ఈ మూడూ డీఈఐసీకి వెన్నెముఖ లాంటివి. ఈ రకమైన వైద్యం కోసం ఎక్కువగా బైరెడ్డిపల్లి, కుప్పం, హిందూపురం, వీ.కోట, తిరుపతి నుంచి వస్తున్నారు. వారందరికీ కూడా నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాం.

–విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్, చిత్తూరు

డాక్టర్లు వెంటనే స్పందిస్తున్నారు



మాది ములకల చెరువు మండలం, ముత్యాలయ్యవారిపల్లి గ్రామం. మా సోదరుడికి ప్రత్యూష (07), హేమసాగర్ (16) పిల్లలున్నారు. పుట్టుకతోనే వినికిడిలోపం, మాటలు రావు. ఇన్నాళ్లు మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నాం. మూడు రోజుల క్రితం చిత్తూరుకు రెఫర్ చేశారు. ఇక్కడికి వచ్చాక డాక్టర్లు వెంటనే స్పందించారు. పిల్లలకు అన్ని పరీక్షలు చేశారు.

–రమణ, సత్యసాయి జిల్లా

క్రీడానైపుణ్యాలు వెలికితీద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- 14 నుంచి వెయ్యి క్రికెట్ జట్లతో మెగా క్రికెట్ టోర్నీ
- నిర్వహణ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, పల్లెల మధ్య స్నేహబంధాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తుమ్మలగుంట క్రికెట్ క్రీడామైదానంలో పార్టీ నేతలు, క్రికెట్ పై అవగాహన కలిగిన వారితో సమావేశమైన ఆయన టోర్నమెంట్ నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. ఆయా డివిజన్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకుని పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరనీ టోర్నమెంట్ ప్రారంభం రోజున తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మలగుంట సమీపంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద క్రీడామైదానంలో ఈనెల 14 నుంచి టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే ప్రాంగణంలో 12 మైదానాలు ఏర్పాటు చేసి ఒక్కొక్క మైదానంలో రోజూ నాలుగు మ్యాచ్‌ల చొప్పున 70కి పైగా మ్యాచ్‌లను నిర్వహించనున్నట్టు తెలిపారు. అతి పెద్ద ఫ్లడ్ లైట్లు కూడా ఏర్పాటు చేసినట్టు వివరించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు వెయ్యి టీములు (15 వేల మంది క్రీడాకారులు)తో పాటు మరో 10వేల మంది పోటీలను తిలకించడానికి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన రీతిలో పార్కింగ్ ఏర్పాట్లు, క్రీడాకారులకు అవసరమైన వాటర్ బాటిళ్లు, ఎనర్జీ డ్రింక్, అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం సరఫరా చేయాలని చెప్పారు. ఎక్కడా లోటురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

అందరికీ రుచికరమైన భోజనాలు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం రుచికరమైన భోజనం ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే చెవిరెడ్డి చర్యలు తీసుకున్నారు. క్రీడాకారులతో పాటు ప్రేక్షకులు సైతం తృప్తిగా తినే విధంగా వంటకాలు సిద్ధం చేయాలని సూచించారు.

పౌష్టికాహార పంపిణీలో లోపాలుంటే సహించం



రేణిగుంట బుగ్గవీధిలోని అంగన్‌వాడీ పిల్లలతో మంత్రి ఉషశ్రీ చరణ్

రేణిగుంట: అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలు, గర్భవతులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం పంపిణీలో లోపాలుంటే సహించమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు. ఆమె రేణిగుంట పట్టణం బుగ్గవీధిలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రిస్కూల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి పాటలు, ఆంగ్ల భాష ప్రావీణ్యాన్ని పరీక్షించారు. అనంతరం పౌష్టికాహారం, వంట సామగ్రి స్టాకును పరిశీలించారు. పిల్లలకు అందించే కోడిగుడ్లు సైజు తక్కువగా ఉండడం, కొన్ని కోడిగుడ్లు మీద స్టాంపు ముద్రలు లేకపోవడంపై అంగన్‌వాడీ టీచర్ ధనమ్మను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ అలాగే సరఫరా చేశారని బదులిచ్చారు. పాలు కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని పిల్లల తల్లిదండ్రులు మంత్రికి ఫిర్యాదు చేయగా, కాంట్రాక్టర్ సక్రమంగా సరఫరా చేయలేదని తెలిపారు. దీనిపై విచారించి తమకు నివేదికను అందించాలని పీడీ జయలక్ష్మిని ఆమె ఆదేశించారు. అక్కడే ఉన్న గర్భిణులు, బాలింతలు తమకు సెంటర్‌కు రావడం కష్టంగా ఉందని, పౌష్టికాహారం ముందులాగా ఇంటికే అందజేయాలని మంత్రిని కోరారు. ఆ ప్రతిపాదన ఉందని, జూన్ నుంచి ఆ విధానం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రంలో వండిన పౌష్టికాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, సీడీపీవోలు కృష్ణమంజరి, ప్రదీప, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య, చైర్‌పర్సన్ దీపిక

నాయుడుపేట టౌన్: పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య సూచించారు. నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ వారి సారథ్యంలో పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడామైదానంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నీని ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో తోడ్పతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు నాయకులు, బిషప్‌లు, అధికారులు శాంతి కపోతాలను ఎగురువేసి ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతోపాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, సీఐ నరసింహారావు, తహసీల్దార్ రాజేంద్ర, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందనందనా గోవిందా!

- ఆగమోక్తంగా శ్రీనివాసుని కల్యాణం
- ఉదయం వైభవోపేతంగా రథోత్సవం
- రాత్రి అశ్వ వాహనంపై వేదనారాయణుడి విహారం



అశ్వ వాహనంపై విహరిస్తున్న వేదనారాయణ స్వామి



రథాన్ని లాగేందుకు పోటీపడుతున్న భక్తులు

పిచ్చాటూరు: నాగలాపురం వేదనారాయణుని వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణుడు మత్స్యావతారంలో రథంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఆలయానికి చేరిన ఉత్సవమూర్తులకు సుగంధద్రవ్యాలతో అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆలయ మండపంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవితో వేదనారాయణుని కల్యాణం కమనీయంగా సాగింది. అశేష భక్తజనం సమక్షంలో గోవిందనామ స్మరణల నడుమ స్వామివారి కల్యాణంతో ఆలయంలో పండుగ వాతావరణం నెలకొంది. కల్యాణోత్సవనంతరం నవ వరుడైన మత్స్యావతారమూర్తి అశ్వవాహనాన్ని అధిష్టించి తిరువీధుల్లో విహరిస్తూ భక్తుల అనుగ్రహించారు. వాహన సేవ అనంతరం నిజాలయానికి చేరి ఏకాంత సేవలో పవళించారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ భట్టాచార్య, టీటీడీ ఏఈఓ మోహన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం 7.30 గంటలకు పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 10.30 గంటలకు స్నపన తిరుమంజనం, 11.30 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 7.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని టీటీడీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 10నుంచి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ వి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 'ఐటీఐ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 94928 61369, 92937 41997, 77996 79351 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

యువకుడి అరెస్టు


అరెస్టు చేసిన యువకుడితో ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి

వరదయ్యపాళెం: ఇన్ స్టాగామ్‌లో పరిచయం చేసుకుని ఓ బాలిక(14)ను మాయమాటలతో వంచించి, పరారైన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్పేడుకు చెందిన కుమార్ బీఎన్‌కండ్రిగ మండలం, గాజులపెళ్లూరులో తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ, బీఎస్‌కండ్రిగకు చెందిన 8వ తరగతి చదువుతున్న బాలికను ఇన్ స్టాగామ్ ద్వారా పరిచయం చేసుకున్నాడు. వరదయ్యపాళెం గ్రామ పంచాయతీ గోపాలరావు కాలనీలోని తన అక్క ఇంటికి సెలవుల నిమిత్తం వచ్చిన బాలికను ఈ నెల 6వ తేదీన రాత్రి అపహరించి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, సిబ్బందితో కలిసి గాలించి, గురువారం అరెస్టు చేశారు. ప్రేమ పేరుతో బాలికలను వంచిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

భక్తుల జోరు..సారెల హోరు


కళాబృందాల కోలాహలం


సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న కమిషనర్ హరిత దంపతులు, ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

- గంగమ్మకు హోరెత్తిన సంప్రదాయ సారెలు

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత, వెంకన్న చెల్లెలు శ్రీతాతయ్యగుంట గంగ జాతర వైభవోపేతంగా సాగుతోంది. గంగమ్మకు పూజలు, మొక్కులు చెల్లించుకునే భక్తులతో అమ్మవారి ఆలయం కిక్కిరిసిపోతోంది. జాతర సంబరాల్లో భాగంగా మూడో రోజు గురువారం గంగమ్మకు సారెలు హోరెత్తాయి. ఇందులో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ డి. హరిత, భర్త అనిల్ దంపతుల ఆధ్వర్యంలో గంగమ్మతల్లి సారె కోలాహలంగా సాగింది. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. నవదుర్గల నృత్యాలు, డప్పు దరువులు, పులి వేషాలు, దేవతామూర్తుల వేషధారణతో మహిళల ప్రదర్శనలు హోరెత్తాయి.

ప్రత్యేక ఆకర్షణగా పులికలై నృత్యం

కేరళలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అద్భుత నృత్యం రూపకం పులికలై నృత్యం. గంగమ్మ జాతరకు కమిషనర్ సోదరుడు హరికిషన్ ప్రత్యేకంగా కేరళ ఫేమస్ నృత్యరూపకమైన పులికలై నృత్యాన్ని ఆహ్వానించి ఆకట్టుకున్నారు. సుమారు 10 మంది ప్రత్యేక కళాకారులు తమ పొట్టకు పులి బొమ్మలను వేసుకొని భక్తులను రంజింపజేశారు.

గంగమ్మకు రంగస్థలి సారె

రాయలసీమ రంగస్థలి, ఏకవీర ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతాప్ స్వామి సారథ్యంలో గంగమ్మకు సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. 20 మంది కళాకారులు పౌరాణిక వేషధారణలతో పెద్ద గంగమ్మ ఆలయం నుంచి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అలాగే నగరంలోని ప్రముఖ వ్యాపార సంస్థ సీఎంఆర్ గోల్డ్ టెక్స్‌టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీతాతయ్యగుంట గంగమ్మకు వేడుకగా సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా బ్రాహ్మణుల సారె

తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో గంగమ్మకు గురువారం అత్యంత వేడుకగా సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాములవారి ఆలయ దక్షిణ మాడ వీధిలోని బ్రాహ్మణ సమాజం కార్యాలయం నుంచి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం వరకు సారె యాత్ర సాగింది. బ్రాహ్మణ సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, కొత్తపల్లి అజయ్‌కుమార్, వేశాలమ్మ ఆలయ చైర్మన్ కొత్తపల్లి విజయ్‌కుమార్, సీఆర్‌కే.శేషగిరిరావు మాట్లాడుతూ బ్రాహ్మణులు తొలిసారి గంగమ్మతల్లికి సారె సమర్పించడం మహద్భాగ్యమన్నారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.


గంగమ్మకు సారె సమర్పిస్తున్న రాయలసీమ రంగస్థలి, ఏకవీర ఫౌండేషన్ ప్రతినిధులు


తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి సారె


పులికలై నృత్యం


దుష్టసంహారం

భూ సర్వేను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న జేసీ డీకే బాలాజీ

తిరుపతి అర్బన్: జగనన్న భూ సర్వేని వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే.బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ మొదటి విడత సర్వే పనులు పూర్తయిన చోట సరిహద్దు రాళ్లు వంద శాతం పూర్తిగా నాటాలన్నారు. మరోవైపు రెండో విడత పనులు వేగవంతం చేయాలని చెప్పారు. సర్వేకు సంబంధించి అదనపు సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌ఓ శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

వెల్‌నెస్ సెంటర్ కోసం వినతి

- హెల్త్ సెక్రటరీతో తిరుపతి ఎంపీ గురుమూర్తి భేటీ


కేంద్ర హెల్త్ సెక్రటరితో భేటీ అయిన ఎంపీ గురుమూర్తి


కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి భగవంత్‌ఖుభాతో ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించేందుకు సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు వేగవంతం చేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. గురువారం ఢిల్లీలో హెల్త్ సెక్రటరీతో ఎంపీ భేటీ అయ్యారు. ఇదివరకే అనేకసార్లు వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై చర్చించామని హెల్త్ సెక్రటరీకి ఆయన గుర్తుచేశారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సరిపడా తిరుపతిలోని అలిపిరి వద్ద ఉన్న బీఎస్ఎన్‌ఎల్ కార్యాలయంలో స్థలం అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలియజేశారు. అందుకు సంబంధించి బీఎస్ఎన్‌ఎల్ వారి నుంచి అందిన లిఖిత పూర్వక సమాధానాన్ని ఇదివరకే అందజేశామని ఆయనకు గుర్తుచేశారు. వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, రెఫరల్ వైద్య చికిత్స పొందేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక శాఖ అనుమతులు రాగానే వెంటనే వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపడుతామని ఎంపీ గురుమూర్తికి హెల్త్ సెక్రటరి తెలిపారు.

'క్రిబ్‌కో బయో ఇథనాల్' పనులు ప్రారంభించాలి

తిరుపతి పార్లమెంట్ పరిధిలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో ఏర్పాటుచేయనున్న క్రిబ్‌కో బయో ఇథనాల్ కర్మాగారానికి త్వరగా పనులు ప్రారంభించాలని గురువారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి భగవంత్‌ఖుభాను తిరుపతి ఎంపీ గురుమూర్తి కోరారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు ఎంపీ తెలిపారు.

జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయం ప్రారంభం



ప్రారంభమైన జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయం

రేణిగుంట: రేణిగుంట మండలం గురవరాజుపల్లి సమీపంలో రాయలసీమ రీజియన్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. రాయలసీమ జోన్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.బసిరెడ్డి ప్రత్యేక పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన చాంబర్‌లో విధుల్లో చేరారు. ఆయనకు తిరుపతి జిల్లా డీటీవో సీతారామిరెడ్డి, చిత్తూరు జిల్లా డీటీవో నిరంజన్‌రెడ్డి పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని 8 జిల్లాలకు సంబంధించి ట్రాన్స్‌పోర్ట్ శాఖ కార్యకలాపాలను ఇక్కడ నుంచి జరుపుకునే విధంగా రాష్ట్ర రవాణా శాఖ త్వరలోనే విధి విధానాలను జారీచేస్తుందన్నారు. తద్వారా ప్రతి వ్యవహారానికి ఇక్కడ నుంచి విజయవాడకు వెళ్లే భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంవీఐలు, ఆర్‌టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- టీడీపీ, బీజేపీ నుంచి పార్టీలో చేరిక

తొట్టంబేడు(రేణిగుంట): మండలంలోని పూడి గ్రామానికి చెందిన బీజేపీ, టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం గ్రామానికి చెందిన బీజేపీ వార్డు మెంబర్ జగదీష్, నేతాజీ, లక్ష్మీపతి, బాలరాజు, మహేష్, వెంకటేష్, రాజేష్, గిరి, యుగంధర్, వెంకటేష్, నాని, వెంకటమ్మ, సబ్బవల్లి, రేణుకమ్మ, సుబ్బమ్మ తదితరులు పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న నవరత్నాల పథకాలను చూసి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వారు స్పష్టంచేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయానికి తమవంతు కృషిచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకు నరసింహనాయుడు, వడ్లతాంగళ్ బాలాజీరెడ్డి, మురళీ యాదవ్, గురవయ్య, రామచంద్రయ్య, సురేష్, నాగరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి గల్లంతైన బాలుడు


రూపేష్(ఫైల్)

తొట్టంబేడు(రేణిగుంట): ఈతకు వెళ్లి ఓ బాలుడు గల్లంతైన ఘటన మండలంలోని గురుకులపాళెంలో గురువారం విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన రూపేష్(13), ప్రసాద్(12), ఉదయ్(13) ముగ్గురూ స్నేహితులు. సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఈత నేర్చుకోవడానికి వెళ్లారు. ముందుగా ఉదయ్, రూపేష్ నీటిలో దిగారు. అయితే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో దిగిన వెంటనే రూపేష్ నీటిలో మునిపోయాడు. దీంతో ఉదయ్ కేకలు వేయగా సమీపంలోని వారు ఉదయ్‌ను రక్షించారు. భయాందోళనతో ప్రసాద్ గట్టుపై ఉండిపోయాడు. గల్లంతైన రూపేష్ కోసం బంధువులతో పాటు స్థానికులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై తహసీల్దార్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఈత రాని వారు అప్రమత్తంగా ఉండాలని, ఆయా గ్రామాల్లో వీఆర్‌ఓలు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పన్ను ఎగ్గొట్టేందుకే..!


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పోలీసులు
స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు


బంగారం తరలిస్తూ పట్టుబడిన నలుగు వ్యక్తులు

దొరవారిసత్రం: ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగొట్టేందుకే కొందరు అక్రమమార్గాన్ని ఎంచుకుని తనిఖీల్లో పట్టుబతున్నారని నాయుడుపేట సబ్‌డివిజన్ డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల కిందట దొరవారిసత్రం మండలం, తల్లంపాడు గ్రామ సమీపంలోని స్వర్ణా టోల్‌ప్లాజా వద్ద నాయుడుపేట, సూళ్లూరుపేట సీఐలు సోమయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, డీవీ సత్రం, తడ ఎస్‌ఐలు తిరుమరావు, శ్రీనివాసులురెడ్డి, పోలీస్ సిబ్బంది నిఘా ఉంచి రెండు కార్లలో తరలిపోతున్న రూ.2.5 కోట్ల విలువ చేసే 5 కేజీల 201 గ్రాముల బరువుగల 11 బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్న విషయం తెల్సిందే. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద డీఎస్పీ ఆ వివరాలను విలేకరులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించాల్సిన జీఎస్టీ, ట్యాక్స్‌లు వంటివాటిని ఎగ్గొట్టి చెన్నై నుంచి నరసరావుపేటకు కే వెంకటసుమంత్, ఆర్ దిలీప్‌వెంకట్‌నాగసాయిహరిప్రసాద్, కే సాయికుమార్, కే రాజు రెండు కార్లలో బంగారు బిస్కెట్లు తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తిరుపతి కస్టమ్స్ అధికారులకు అప్పగించినట్టు ఆయన పేర్కొన్నారు.

అవిలాల జాతరకు వచ్చి...తొండవాడలో శవమై..!


తొండవాడ బస్టాప్‌లో నారాయణ ఆచారి మృతదేహాన్ని పరిశీలిస్తున్న చంద్రగిరి పోలీసులు

తిరుపతి రూరల్: తిరుపతి బైరాగిపట్టెడ ఎంకేనాయుడు కాలనీకి చెందిన నారాయణ ఆచారి(65) మంగళవారం సాయంత్రం అవిలాల జాతరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వచ్చాడు. అయితే రెండు రోజులుగా అతను ఇంటికి రాకపోవడంతో బంధువుల వద్దకు వెళ్లాడని కుటుంబ సభ్యులు భావించారు. అయితే గురువారం సాయంత్రం చంద్రగిరి మండలం, తొండవాడ బస్టాప్‌లో ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ముందుగా గుర్తుతెలియన వ్యక్తిగా భావించారు. సోషల్ మీడియాలో ఫొటోలు రావడంతో నారాయణ ఆచారి కుటుంబ సభ్యులు గుర్తించారు. జాతరకు వెళ్తున్నానని చెప్పి ఊరు కాని ఊరు వచ్చి శవమై పోయావా... అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. నారాయణ ఆచారి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చంద్రగిరి సీఐ ఓబులేసు తెలిపారు.